అన్నదాత కష్టం వర్షార్పణం

- నీట మునిగిన వరి పంట
- వర్షాలకు నానిపోయిన ధాన్యం
- గ్రామాల్లో పర్యటించిన అధికారులు
- బోనిలో ధాన్యం కొనుగోలు ప్రారంభం



పాడుగుపాలెంలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి, అధికారులు



నిల్వ చేసిన ధాన్యం చుట్టూ చేరిన వర్షపు నీరు

ఆనందపురం : అన్నదాతకు అకాల కష్టం వచ్చిపడింది. చేతి వరకు వచ్చిన పంట చేజారిపోయింది. ఇంటికి తీసుకెళ్లాల్సిన దశలో ఉన్న పంట వర్షార్పణమైంది. నేల వాలిన పంటపై నీరు ప్రవహిస్తుండడంతో రైతు కన్నీరుమున్నీరు అవుతున్నాడు. పిల్లాపాపలతో కలిసి పొలాల్లోని పంటను, నూర్చిన ధాన్యాన్ని రక్షించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తమరెక్కల కష్టం వర్షార్పణమైందని అన్నదాతలు విలపిస్తున్నారు. మిచాంగ్ తుపాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పొలాల్లో వరద నీరు ముంచెత్తింది. వరి చేను నేలమట్టం కావడంతో మడులలో నీరు చేరి మునిగిపోయింది. మండలంలోని బోని, ఆనందపురం, గొట్టిపల్లి, శిర్లపాలెం, జగన్నాథపురం, కుసులువాడ, పాడుగుపాలెం, దొంతలవారి కళ్లాలు, కణమాం తదితర గ్రామాల్లో వరి పంట తీవ్రంగా దెబ్బతింది. అధికారుల లెక్క ప్రకారం వందల ఎకరాల వరకు నీట మునిగినట్టు అంచనా వేస్తున్నారు. ఇంకా ఎక్కువే ఉండొచ్చని రైతులు తెలుపుతున్నారు. నూర్చిన ధాన్యం మొలకెత్తే అవకాశం ఉండగా, నీట మునిగిన పంట ఎందుకూ పనికి రాకుండా పోతుందని రైతులు అంటున్నారు. గుడిలోవ ఛానల్ గట్టుకు గండి పడడంతో దొంతల వారి కళ్లాలు పొలాల్లో వరదనీరు చేరుతోంది.

ఆర్డీవో, జిల్లా వ్యవసాయాధికారి పర్యటన

భీమిలి డివిజన్ ఆర్డీవో భాస్కరరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి తదితర అధికారులు బోని, పాడుగుపాలెం, గొట్టిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. బోని గ్రామంలో నిల్వ చేయగా తడిచిపోయిన ధాన్యాన్ని ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న ధాన్యం ఏ స్థితిలో ఉన్నా కొనుగోలు చేయమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని, దీంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బోని ఆర్బీకేలో ప్రారంభమైన కొనుగోలు కేంద్రం ద్వారా బుధవారం ఆరు టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు.



చెరువును తలపిస్తున్న వరి పొలంలో రైతులు



నీటిలో వరి పనలు



తాళ్లవలసలో కనకాంబరం తోటలో నిలిచిన వర్షం నీరు



బోని గ్రామంలో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, తదితరులు



సంగివలస సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీటిలో వాహనాల రాకపోకలు

అన్నదాతలకు పరిహారం అందజేస్తాం



కోరాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: తుపాన్ ప్రభావంతో వరి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోరాడలో దెబ్బతిన్న వరి పంటను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంట దెబ్బతిన్న రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని, నష్ట పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయప్రసాద్, ఏవో ఎంవీఎస్ చలం పాల్గొన్నారు. విలాస్కాన్‌పాలెంలో దెబ్బతిన్న వరి పంటను భీమునిపట్నం ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. కోరాడ, విలాస్కాన్ పాలెం గ్రామాల్లో వరి పంట నేల కొరగింది. గాలి దిబ్బలు వర్షపు నీటిలో నానుతున్నాయి. చేతికి అందొచ్చిన పంట వర్షార్పణం కావడంతో రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వర్షం తెరిపివ్వగానే మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులకు ధైర్యం చెప్పారు. తహసీల్దార్ లోకవరపు రామారావు, భీమిలి ఏడీఏ విజయప్రసాద్, వ్యవసాయాధికారి సంధ్యారత్నప్రభ పంట పొలాలను పరిశీలించారు.

నిండుకున్న గంభీరం రిజర్వాయర్

మండలంలోని గంభీరం రిజర్వాయర్ వరద నీటికి పూర్తిగా నిండుకుంది. రిజర్వాయర్ గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 126 అడుగులు కాగా ప్రస్తుతం సరాసరి స్థాయికి చేరుకోవడంతో అదనంగా చేరుతున్న వరదనీరు కిందకు ప్రవహిస్తోంది.

ఎడతెగని వానతో ఇక్కట్లు

తగరపువలస: తుపాను కారణంగా నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భీమిలి జోన్‌లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదర్శనగర్, సబ్బివానిపేట, సంగివలస పరిధిలో గ్రామాల చుట్టూ వర్షం నీరు నిలిచిపోవడంతో జీవీఎంసీ సిబ్బంది మోటార్లు ఉపయోగించి తోడుతున్నారు. సర్వీస్‌రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకపోకలకు మొరాయిస్తున్నాయి. భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యానవన పంటలకు నష్టం

భీమిలి డివిజన్‌లో వర్షాల కారణంగా మెట్ట పంటలకు నష్టం కలిగింది. ముఖ్యంగా ఈ సీజన్‌లో ఎక్కువగా సాగయ్యే దొండపంట నీటిలో మునిగిపోవడంతో రైతులు మడుల నుంచి నీటిని తోడేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే చిక్కుళ్లు, కనకాంబరం, మిరప, వంగ, బంతిపూల తోటలు, పాదులు నీట మునగడంతో నష్టం వాటిల్లినట్టు రైతులు వాపోతున్నారు.

క్లుప్తంగా

13 నుంచి 'చాగంటి' ప్రవచనాలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో ఈ నెల 13 నుంచి 19 వరకు భాగవతంలో ముఖ్య ఘట్టాలపై ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు వినిపించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి తెలిపారు. శ్రీ అష్టలక్ష్మీ సహిత శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి, శ్రీ మంగళగౌరీ సహిత వైశాఖీశ్వరస్వామి దేవాలయాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రవచనాలు రోజూ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

మధురవాడ: భారత్ సంకల్ప యాత్రలో భాగంగా టీబీ రోగులకు మధురవాడలో బుధవారం పోషకాహారం పంపిణీ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ సెంట్రల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ వీరికి ప్యాకెట్లు అందజేశారు. టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే నివారణ సాధ్యమని సూచించారు. వైద్యుడు గంగునాయుడు, సిబ్బంది వీరబ్రహ్మం, రమణ పాల్గొన్నారు.

హృద్రోగుల రక్షణకు సీపీఆర్ దోహదం

కొమ్మాది: హృద్రోగుల్లో గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు ప్రాణాలు కాపాడటానికి హృదయ శ్వాసకోస పునర్జీవన చర్య (కార్డియో పల్మనరీ రిసస్కిటేషన్) ఉపయోగపడుతుందని గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ వైద్య నిపుణులు తెలిపారు. గుండె పోటు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచనల మేరకు సీపీఆర్ టెక్నిక్‌పై సాధారణ ప్రజలకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు మాట్లాడుతూ సాధారణ ప్రజలు సైతం సీపీఆర్‌పై అవగాహన పెంచుకుంటే ప్రాణాలు కాపాడవచ్చని సూచించారు.

మహిళలకు స్టౌ, సిలిండర్ల అందజేత



మహిళకు స్టౌ, సిలిండర్ అందజేస్తున్న నాయకులు

ఆనందపురం : మండలంలోని తర్లువాడలో బుధవారం మహిళలకు భారత్ ఉజ్వల యోజన పథకం కింద స్టౌ, సిలిండర్లు అందజేశారు. స్థానిక సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు 27 మంది మహిళలకు వీటిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక్కొక్క స్టౌ, సిలిండర్, రెగ్యులేటర్, లైట్, కనెక్షన్ పైపు ధర సుమారు రూ.6 వేలు కాగా రాయితీతో కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.600 కే అందిస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్ఎస్ దేవి పాల్గొన్నారు.

ఆర్ఎస్ వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందు భాగం

తగరపువలస: జాతీయ రహదారిపై సంగివలస వద్ద మంగళవారం రాత్రి నిలిపి ఉంచిన రోడ్డు సేఫ్టీ (ఆర్ఎస్) వాహనాన్ని శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు ఢీ కొట్టింది. అర్ధరాత్రి జోరున వర్షం కురుస్తున్న సమయంలో జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలను క్లియర్ చేయడానికి రోడ్డు సేఫ్టీ వాహనంతో వచ్చిన సిబ్బంది ఆ పనిలో నిమగ్నమై ఉన్నారు. ఆ సమయంలో ప్రయాణికులతో విశాఖ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న లారీని కుడి వైపు నుంచి కాకుండా ఎడమ వైపు నుంచి తప్పించే ప్రయత్నంలో అక్కడే నిలిపి ఉంచిన ఆర్ఎస్ వాహనాన్ని ఢీ కొట్టింది. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యనారాయణ స్వామి కొండపై పరిశీలన



కొండపై ఆలయం వద్ద పగుళ్లు, కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న అర్చకుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: తుపాను ప్రభావంతో స్థానిక శ్రీరమా సత్యనారాయణస్వామి కొండపై ఆలయం అడుగుభాగం, ఇటీవల కూలిన ప్రహరీని వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం పరిశీలించారు. చిట్టివలస వీఆర్వో గీత, అర్చకుడు ఏడిద వివేకానంద శర్మ తదితరులు కొండపై దెబ్బతిన్న భాగాలను పరిశీలించారు. ఈ విషయాన్ని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి మరమ్మతుల ఆవశ్యకతను వివరిస్తామన్నారు. ఆలయ చైర్మన్ సరగడ నాగిరెడ్డి, 2వ వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, తెడ్లాపు అప్పలరాజు తదితరులు పరిశీలించారు.

మందుబాబులకు కమ్యూనిటీ శిక్ష

ఆనందపురం: మండల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 38 మందికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జి.విజయలక్ష్మి బుధవారం జరిమానాతోపాటు కమ్యూనిటీ శిక్ష విధించారు. జరిమానా కింద ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించి, భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి, పెద బజారులోని పరిసరాలను శుభ్రం చేయించారు.

వ్యసనాలతో అనర్థాలు



అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ సురేష్

తగరపువలస: కార్మికవాడలోని ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు క్రైమ్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కలిగించారు. వివిధ నేరాలు జరుగుతున్న విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యసనాల వల్ల కలిగే అనర్థాలు, వాటిబారిన పడి ప్రమాదాలకు గురయ్యే తీరును మధురవాడ నార్త్ జోన్ సీఐ కె.సురేష్ వివరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో భీమిలి ఎస్ఐ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం



మృతుని కుటుంబ సభ్యులకు రూ.25 వేల చెక్కు అందిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

భీమునిపట్నం: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మన్యాలపేటకు చెందిన దువ్వి బాలాజీ కుటుంబ సభ్యులకు కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం అందించారు. చనిపోయిన వ్యక్తి తల్లితండ్రులు పేదవారు కావడంతోపాటు వారికి బాలాజీ ఒక్కడే కొడుకు కావడంతో ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు.

క్రీడాకారునికి ఆర్థిక సాయం

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ మహాలక్ష్మిపురానికి చెందిన కర్రి చిట్టిబాబుకు సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు బుధవారం రూ.3వేల సాయం అందించారు. పాండిచ్చేరిలో జరుగనున్న ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న చిట్టిబాబుకు ఈ సాయం అందించారు.

వర్షాలతో రోడ్లన్నీ జలమయం



బీచ్‌రోడ్డు రామాద్రి వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు



మారికవలసలో కొండ చరియను పరిశీలిస్తున్న జీవీఎంసీ ఈఈ శాంతి రాజు తదితరులు

కొమ్మాది: తుపాను ప్రభావంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. మారికవలస, కొమ్మాది, రాడిసన్ బ్లూ, రామాద్రి ప్రధాన రహదారుల వద్ద నీరు భారీగా చేరడంతో చెరువులను తలపించాయి. కాపులుప్పాడలో చేతికి అందొచ్చిన వరి పంట నీట మునిగింది. మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. భారీ వర్షాల కారణంగా భీమిలి బీచ్‌రోడ్డు వెంట ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలన్నీ బోసిపోయాయి.

- వర్షాలతో కాలువలు, రోడ్లన్నీ జలమయమవడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నట్లు జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి అన్నారు. రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, తిమ్మాపురం, కొమ్మాది, మధురవాడ ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటించారు. జీవీఎంసీ సిబ్బందితో కలిసి అవసరమైన చర్యలు చేపట్టారు. నిల్వ నీరు తొలగింపజేయించారు.

మారికవలసలో జారిపడిన కొండచరియ

మధురవాడ: మిచాంగ్ తుపాను తీరం దాటడంతో ముప్పు తప్పింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మధురవాడలో వాహనదారులు, వీధి వ్యాపారులు, దినసరి కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరిపోయింది. బుధవారం జీవీఎంసీ 5వ వార్డు మారికవలస శారదానగర్ కొండ మీద పల్లా గోపాలం – చిన్నమ్మలు, సాకేటి కృష్ణ – పుష్ప నివాసాలను ఆనుకుని కొండ మట్టి జారిపడిపోయింది. దీంతో కింద నివాసాలకు ముప్పు ఏర్పడింది. సంఘటన స్థలిని జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఈఈ శాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అప్పలరెడ్డి, వీఆర్వో పూర్ణ పరిశీలించారు. ఇక్కడ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపడతామని ఈఈ చెప్పారు.

పీఎం పాలెం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. హౌసింగ్ బోర్డు కాలనీ, సుగర్ కేన్ లే అవుట్ పరిధిలో పలు చోట్ల నీరు నిలిచిపోయింది. జీవీఎంసీ పారిశుధ్య విభాగం స్పందించి నీరు తొలగించడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న జీవీఎంసీ అధికారులు, సిబ్బంది



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వాసురాజు, తదితరులు



పద్మనాభంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెద్దిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురవాడ: భారతరత్న బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని మధురవాడలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పలువురు అధికారులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ, ఇతర పార్టీలు, సంఘాల నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్సీ కనక మహాలక్ష్మి, అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు.

- అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ 6వ వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు జె.శివ, భీమిలి నియోజకవర్గ ఎస్సీ సెల్ ఇన్‌చార్జి ఎస్.కనకరాజు, వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, గౌరవ అధ్యక్షుడు గాదె రోశిరెడ్డి, పోతిన సురేష్, గుంటబోయిన సంజీవ్, రాయిన సాయి నివాళులర్పించారు.
- జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎం.శేఖర్, రవి, మురళి నివాళులర్పించారు.

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస ఎస్సీ కాలనీ కూడలిలో డాక్టర్ బాబా సాహెబ్ వికాస సంఘం అధ్యక్షుడు బోనిల సన్నిబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. యాగాటి వెంకటరమణ, వాడ్ర అప్పలసూరి, మామిడి భాస్కరరావు, బోని వెంకన్న, సామంతుల అప్పలరాజు, టి.గౌతం, బోని హేమంత్, సిద్ధార్థ, బోని ప్రసాద్ పాల్గొన్నారు. తగరపువలస అంబేడ్కర్ కూడలిలో మాజీ కౌన్సిలర్ ఉప్పాడ నాగేశ్వర రావు, ఎస్సీ సెల్ నాయకులు పందిరి విజయ్‌కుమార్, సిమ్మల ప్రసన్న పాల్గొన్నారు. కార్మికవాడలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు నివాళులర్పించారు. సంతపేటలో మాజీ కౌన్సిలర్ జీవీ రమణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, రెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఈర్ల ఈశ్వరరావు, మొకర అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం, కొత్తపల్లి సత్యనారాయణ, తాలాడ నరసింహనాయుడు, సుంకర నారాయణరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం: మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ దంతులూరి వాసురాజు, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలు, కులాల ప్రజలకు సమాన హక్కులు కల్పిస్తూ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించడంతో అందరూ హాయిగా జీవనం సాగిస్తున్నారన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎస్.జనార్దన్ అధ్యక్షతన అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. న్యాయవాదులు సూరిబాబు, ముమ్ముడిశెట్టి సునీల్, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, ఏజీపీ పాత్రుడు, బి.ఈశ్వరరావు, ఎస్.రవికుమార్, పి.ఎ.నాయుడు, సింహాచలం పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది నివాళులర్పించారు. కీతిన్‌పేట అంబేడ్కర్ కాలనీ వద్ద మాలమహానాడు నాయకుడు భాగం గోపాలరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు బోనుల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు కింటాడ బండయ్య, రవ్వ రమేష్, సియాద్రి వెంకట్, బెల్లాన శ్రీనివాస్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

ఆనందపురం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పెద్దిపాలెం సర్పంచ్ బావిశెట్టి భారతమ్మ అన్నారు. పెద్దిపాలెంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం నివాళులర్పించారు. న్యాయవాది మరుపిళ్ల చిన్నయ్య పాత్రుడు, నాయకులు పీవీవీ ప్రసాదరావు పట్నాయిక్, మీసాల రామునాయుడు, బావిశెట్టి రాజు, ఉప సర్పంచ్ మరుపిళ్ల నిర్మల, కార్యదర్శి శివప్రసాద్, గుండు ఎల్లారావు, ఎం.కృష్ణ, అప్పలరాజు, బంగారి రాజు, చిన్న పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పక్కాగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను పక్కాగా నిర్వహిద్దామని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పోటీలపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17 నుంచి 20 వరకు సచివాలయ స్థాయిలో, 21 నుంచి 24 వరకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కె.వేణుగోపాలరావు, రెడ్డిపల్లి హైస్కూల్ హెచ్‌ఎం ఎం.సన్యాసిరావు, ఎస్ఐ సురేష్, పీఈటీలు పాల్గొన్నారు.

అక్షరాస్యత నైపుణ్యాల పెంపునకు వర్క్‌షాప్



కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు, తదితరులు

తగరపువలస: ప్రాథమిక అక్షరాస్యత నైపుణ్యాలు పెంపొందించడానికి, అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో అధ్యాపకులను సన్నద్ధం చేయడానికి మెల్‌బోర్న్‌లోని విక్టోరియా విశ్వవిద్యాలయానికి చెందిన రిసోర్స్‌పర్సన్లు భీమిలి కేథరిన్ విద్యాసంస్థలో మూడు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహించారు. వీరిలో ప్రొఫెసర్లు మార్సెల్లే కాకియాటోలో, మార్క్ వికార్స్, గ్రెగ్ 25 మంది విద్యార్థులతో కలిసి ఇండియా స్టడీ టూర్‌లో భాగంగా వర్క్‌షాపులో పాల్గొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహకారం అందించడానికి విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా భారతదేశాన్ని ఎంచుకున్నట్టు తెలిపారు. విద్యార్థులకు చదవడం, రాయడం, మౌఖిక భాష అభివృద్ధిలో పునాది అవసరమన్నారు. అక్షరాస్యత పెంపొందించడానికి వ్యూహాలు, అన్వేషణ, చర్చకు వేదికగా వర్క్‌షాపు ఉపయోగపడిందన్నారు. కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి మాట్లాడుతూ తమ ఉపాధ్యాయుల బోధనా లోపాలను అర్థం చేసుకోవడానికి రిసోర్సుపర్సన్లు సహాయపడినట్టు తెలిపారు.